# నవ్వింది జాబిల్లి

మనస్సు కోతిలాంటిదేనంటే ఒప్పుకోక తప్పదు. కుదురుగా కూర్చున్నట్టే కూర్చుని అంతలోనే ఉలిక్కి ఉలిక్కి పడుతుంది. పకపకా నవ్వుతూనే బావురుమని ఏడుస్తుంది.

అది కల్గించే అనుభూతులు ఎప్పటికప్పుడే విచిత్రంగా వుంటాయి.

హేమలత అలాగే ఓ చిత్రమైన అనుభవంలో చిక్కుకొంది.

"నువ్వీమధ్య చాలా మారిపోతున్నావు హేమా!"— అన్నాడు శేఖర్ మరోసారి.

భార్యమీద తన అభిప్రాయం తరుచూ వెలిబుచ్చుతూనే వున్నాడు.

భర్త అలా అన్నప్పుడల్లా ఉలిక్కిపడి తనని తను తమాయించుకోటానికి ప్రయత్నిస్తూ నవ్వేస్తుంది హేమలత. "నేనా? మారిపోతున్నానా? ఇది మరీబావుంది." అంటుంది అతి నిర్లక్ష్యంగా.

"చూడు. నీ నవ్వులోకూడా మునుపటి కాంతిలేదు."

"ఊఁ. ఏం మారిపోయానో చెప్పండి చూదాం."

"అదే అర్థం కాకుండా వుంది. ఎటూ ఆలోచించలేక పోతున్నాను."

"నువ్వు నువ్వుగా మాత్రం లేవు. అంతవరకూ చెప్ప గలను."

ఇక శేఖరం కళ్ళలోకి సూటిగా చూడలేక హేమలత చూపులు దించేసుకుంది.

"అంతా మీ భ్రమ, నేనేమీ మారలేదు. ఎప్పటి లాగే వున్నాను."

"అంతేనంటావా?" రెట్టించిన శేఖరాన్ని,

"అంతగాక ఇంకెంత?" అంటూ వదిలించు కోవాలని ప్రయత్నించింది.

"కాదు, కాదు. అంత కాదు, ఎంతో వుంది... ఎంతో వుంది." అంటూ ఎవరో కసికొద్దీ తనగుట్టు బయటపెట్టేస్తు న్నట్టు దిక్కులు చూసింది. "అంతా మీ భ్రమ. నేనేమీ మారలేదు,"—అని శేఖరాన్ని మభ్యపెట్ట గలదేగానీ క్షణ కాలం కూడా మౌనంవహించని తన మనస్సునెలా మూగ పరచగలదు? తను ఎంత మారిందో, ఎందుకు మారిందో తనకి తెలుసు. తనని చూసి ఎవరో భ్రమపడుతున్నారని తనే భ్రమపడుతోందేమో, తన కల్పనలన్నీ కట్టిపెట్టి అంత రాత్రిముందు తలదించక తప్పదు.

ఏమీ చెయ్యలేనిదానిలా నిట్టూర్చింది హేమలత.

శేఖరం అడిగిన ప్రశ్నలు ఎప్పుడూ తనని వెన్నాడు తూనే వున్నాయి.

"నువ్వెందుకు మారిపోయావు?__" ఖర్మ కాకపోతే తనేం చెప్పగలదు. జరిగిందంతా కాలప్రభావంమీదికి గెంటి వేసి నిర్దోషిగా తనకి తప్పించుకోవాలనిపిస్తోంది. కొన్ని కొన్ని క్షణాలు చాలా చెడ్డగా పరిణమిస్తాయి. వాటి ప్రభావం గుడ్డిగా ఎక్కడెక్కడికో ఈడ్చుకుపోతుంది.

కాకపోతే ఏమిటి? తనకెందుకింత చాంచల్యం? తనలో ఎందుకిటువంటి బలహీనత? మంచిచెడ్డలు తనకేం తెలీవని? లోకజ్ఞానం మాత్రం తనకేం తక్కువని?

అప్పటికి జీవితంలో వేలాదిమంది మగవాళ్ళని చూసింది. కాని...కాని... అంతటి నవమన్మథుణ్ణి ఎన్నడూ చూడలేదు. నిజమే. అయితే మాత్రం ఎందుకింత మార్పు తనలో? ఎప్పటికైనా అతన్ని అందుకోగలదా?...భ్రమ!... బాధగా కణతలు నొక్కుకుంది హేమలత. అతని ఆలోచన వచ్చినంతమాత్రమే శిరస్సు భారమైపోతుంది. శరీరం వశం తప్పుతుంది. మనస్సంతా కలతబారిపోతుంది.

ఎంత వద్దనుకున్నా...ఎంతతుడిచివేసుకున్నా...ఆ జగన్మోహన విగ్రహం ఎట్టెదుట ప్రత్యక్షమౌతూనే వుంది. ఆ సౌందర్యమూర్తి క్షణక్షణం తనమతి పోగొట్టి పిచ్చిదాన్ని చేస్తోనేవున్నాడు. ఇక నేం చెయ్యగలదు తను?

ఆరోజు...సరిగ్గా వారం రోజుల క్రిందట శేఖరూ, తనూ ఎంతో సరదాగా సినిమాచూస్తూ కూర్చున్నారు థియేటర్ లో. ఆశించినదానికన్నా అమోఘంగా నడుస్తోన్న సినిమాని వుత్సాహంగా చూస్తూ-నెమ్మదిగా కబుర్లు చెప్తూ

కుంటూ.... అప్పుడప్పుడూ విమర్శించుకొంటూ .... తెలీని విధంగా కాలంగడిపేస్తోంటే వెండితెరమీద- "విశ్రాంతి." మెరిసింది. వెనువెంటనే హాలంతా దీపాలు వెలిగి పట్టపగలయింది.

"బైటికి వెళ్దాం. వస్తావా హేమా?" అన్నాడు శేఖర్ లేస్తూ.

"నేను రానులెండి." అంది తను బద్ధకంగా.

"పోనీ నీకేమైనా కావాలా?"

"ఏం తెస్తారేమిటి?" అంటూ నవ్వింది తను.

"బిళ్ళలో.... బిస్కత్తులో...."

"బఠానీలుకూడా.... చాలుగాని వెళ్ళిరండి. నేనేం పాపాయినా?"

"ఆహా! ఆరిందావిలే.,.." అనేసి వెళ్ళిపోయాడు శేఖర్!... శేఖర్ తనని కూడా రమ్మని బైటికి తీసుకుపోతే ఎంతబావుండేది? తనకీ క్షోభ తప్పిపోయేది కదూ?— హేమ ఆలోచనలు క్షణకాలం స్తంభించి పోయాయి. ఆ పైన జరిగింది నెమరువేసుకోవటానికి ధైర్యం చాలటంలేదు. ఏదో జంకు పుట్టుకొస్తోంది— పదేపదే ఆ ఘట్టాన్ని తిరగ తవ్వుకుని ఆ అనుభూతుల్ని మననం చేసుకుని ఏం చెయ్యగలదు? అదొక దురదృష్టపు సంఘటన అనుకునిమర్చిపోవటానికి ప్రయత్నించాలే గానీ ఇలా గుర్తు తెచ్చుకుంటూ బాధపడుతూ కూర్చుంటే నిజంగా పిచ్చిదైపోదూ?

మనస్సుని బంధించుకోవాలనీ .... ఆ పాడు స్మృతిని తుడిచి వేసుకోవాలనీ- హేమ ఎంత ప్రయత్నించిందో అంత విఫలురాలైంది.- వివశురాలై నిట్టూర్చింది. అప్రయత్నంగానే ఆసంఘటన ఆమె మెదడులో మెదల నారంభించింది.

శేఖర్ బయటికి వెళ్ళగానే హేమ బద్ధకంగా వేళ్ళు విరుచుకుంటూ తలతిప్పి ఓసారి నాలుగు వేపులా పరిశీలించ బోయింది కుతూహలంగా.

....తళుక్కున మెరుపు మెరిసింది....ఒక్కక్షణం

ఆమె గుండెలు అమిత వేగంతో కొట్టుకున్నాయి-మరో క్షణం.

ఆమె చూపులు ఎటూకదలకుండా ఆ మూర్తిమీద కేంద్రీకరించు కున్నాయి- అతను బైటనుంచి వచ్చి యధాప్రకారం తనసీట్లోకూర్చుని రుమాలుతో నుదురు ఒత్తుకున్నాడు. సిగరెట్ తీసి వెలిగించుకుని వేళ్ళమధ్య నలుపుతూ కుర్చీ వెనక్కి వాలి గిర్రున తిరుగుతూన్న పంకాలకేసి చూస్తూ నిర్లిప్తంగా కూర్చున్నాడు గ్రీకు శిల్పంలా.

తనని తను మర్చిపోయింది హేమలత. తన వునికిని పూర్తిగా విస్మరించింది. ఏకాంతంలో వున్నంత చొరవగా దీక్షగా తదేకంగా అతన్ని చూస్తూ వుండిపోయింది- ఆ సోయగాన్ని కాదనుకుని కళ్ళు మళ్ళించు కోవటం ఆమె వశం కాలేదు. చటుక్కున అతను చూసినప్పుడైనా తల తిప్పుకోవటం ఆమె శక్తికిమించిన పనైంది.

"మన్మథుడు!"...అస్పష్టంగా...తనకే వినిపించనంత రహస్యంగా పెదవులు విడకుండా ఉచ్చరించుకొంది.

భుజంమీద చెయ్యిపడితే త్రుళ్ళిపడి తల తిప్పింది.

"బఠానీలు దొరకలేదు హేమా!" అంటూ నవ్వి గుప్పెడు చాక్‌లెట్లు చేతిలో పోశాడు శేఖర్.

వాటినలా గేట్లోకి విసిరి కొడదామన్నంత కోపం వచ్చింది హేమలతకు. పైకి కన్పించకుండా చిరాకుగా హేండ్ బాగ్ తెరిచి చాక్‌లెట్లన్నీ అందులోపోసింది.

"తినకుండా దాచుకుంటావా?"

"తింటానులెండి తర్వాత." అయిష్టంగా మాట్లాడింది. మధురమైన కలని చెరిపివేసినట్లు అర్థంగాని బాధకు లోనైంది హేమ. నిస్సహాయంగా బుగ్గన చెయ్యి ఆనించుకుని దీర్ఘంగా తెరకేసి చూస్తూ కూర్చుంది. "నిశ్శబ్దం" అని హెచ్చరిస్తూ రెండు బంగారుపక్షులు మంతనాలాడు కుంటున్నాయి తెర మీద. దీపాలన్నీ ఆరిపోయి థియేటరంతా చిమ్మ చీకటి అలుముకుంది.

చటుక్కున తలతిప్పి ఎడంవేపు వారగా చూసింది హేమ లత.

అతని సౌందర్యకాంతి ఆ చీకటిని కూడా చీల్చు కొంటూ వచ్చి ఆమె కళ్ళకుకట్టింది.

మరొకసారి విస్మయంతో చకితురాలైంది హేమ. మగవాళ్ళలో ఇంతటి అందగాళ్ళున్నారన్న సంగతి వూహకు

కూడా అందనిది. తను కళ్ళారా చూసివుండకపోతే ఎవ్వరెన్ని విధాల చెప్పినా నమ్మరానిది.

"ఎటు చూస్తున్నావ్ హేమా? పిక్చర్ చూడవేం?" హెచ్చరించాడు శేఖర్.

"...చూస్తూనే వున్నాను." నెమ్మదిగా అని తెరకేసి మొహం తిప్పుకోంది హేమ- ఏమీ కన్పించటంలేదు కళ్ళకి. అంతా తెల్లగా పెద్ద మచ్చలా అలుక్కు పోయింది. రెండు నిముషాలు రెప్ప వెయ్యకుండ చూస్తూ కూర్చుంది. ఆ కళ్ళు ఒక్క ఆ మన్మథుని సోయగాన్ని తప్పితే మరేమీ చూడలేవు. గుడ్డివై కలకాలం గాఢాంధకారంలోనైనా తట్టుకోగలవు గానీ - ఆ మూర్తిని విసర్జించి మరో వస్తువుని గ్రహించలేవు.

హేమలత మనస్సంతా గందరగోళమై పోయింది.

అతన్ని... ఎంతసేపు....ఎంతసేపు... చూసినా తనివి తీరటంలేదు. ఊరట కల్గటం లేదు. ఆ బొమ్మలకేసి చూడా లన్న వుత్సాహం ఆసక్తి పూర్తిగా కోల్పోయింది.

ఎవరో కీ యిచ్చి విడిచినట్టుగా హేమలత తల నెమ్మదిగా ఎడంవేపుకి తిరిగి పోయింది. రహస్యంగా చూపులు.... అతనికోసం వెతుక్కున్నాయి.

అతను ముందుకు వంగి ఆసక్తిగా చూస్తున్నాడు తెరకేసి. కొంచెం ముందువరసకి దగ్గిరయ్యాడు. ఒక్కసారిగా అతని వేపునుంచి ఏదో సెంటు వాసన గులాబి రేకలు గుప్పెళ్ళతో విసిరినట్టు సున్నితంగా వీచింది.

మై మరచి మరబొమ్మే అయింది హేమలత.

అతను.... ఒక్కసారి తనకేసి చూడకూడదూ?.... ఒక్కసారి.... ఆ కళ్ళు ఎంతటి సౌందర్య గోళాలో....? ఆ కళ్ళలోకి తొంగిచూస్తే ఎటువంటి సుందరలోకాలు కనపడతాయో!... అతను ఒక్కసారి మాట్లాడరాదూ? ఆ కంఠం విప్పి మాట్లాడితే నెమళ్లు నాట్యం చేయవూ?

అతడు...నిజంగా మానవుడా? రూపుమార్చి దిగివచ్చిన మన్మథుడా? నలకూబరుడా?...

పకపకలతో థియేటరంతా మార్మోగింది.

కంగారుపడి తలతిప్పేసుకుంది హేమలత-ప్రేక్షకులంతా కడుపులు చెక్కలయ్యేలా నవ్వుతున్నారు. నవ్వలేక ఆపసోపాలు పడుతున్నారు. పిక్చర్లో యేదో జరిగింది. తను చూడలేదు. శేఖర్ తన చేయి నొక్కుతూ నవ్వుతోంటే నెమ్మదిగా విడిపించుకుని ఒడిలో దాచుకుంది.

అందరితో కలిసి నవ్వుతున్నాడు.... అతను కూడా హాయిగా. ఆ నవ్వు ఎంత సమ్మోహనకరంగా వుందనీ! మధురగానం వంటి ఆ నవ్వు వింటూ-శ్రావ్యమైన ఆ రాగం వింటూ స్పృహలు కోల్పోవచ్చును. మేఘాలలో తేలిపోవచ్చును.

"ఎందుకు హేమా! అంత పరధ్యానంగా వున్నావు? ఛా! నువ్వు సరిగా పిక్చర్ ఫాలో అవటంలేదు." కొంచెం విసుక్కున్నాడు శేఖర్.

"అబ్బ! ఏమిటో తలనొప్పిగా వుంది." బాధగా కణతలు నొక్కుకుంది హేమ.

"అదేం? ఇంతవరకూ బాగానే వున్నావుగా?"

"..............."

"బాగా నొప్పిగా వుందా? పోనీ వెళ్ళిపోదామా?"

"అహ! వద్దు చూస్తూనే వున్నాగా!"—తప్పనిసరిగా పిక్చర్ చూస్తూ కూర్చుంది. తను పిక్చర్ చూస్తూనే వున్నట్టు రుజూ చేసుకోటానికి మధ్య మధ్య అడ్డ దిడ్డంగా విమర్శలు కూడా చేసింది. మనస్సు లాగుతోన్నా మళ్ళీ మళ్ళీ ఎడం వైపు తలతిప్పి వారగా వెనక్కి చూడటానికి ధైర్యం చాల లేదు— అందాన్ని చూసి ఆనందించే అదృష్టం మాత్రం ఎంతటి వాళ్ళకి! ఛ! పాడుగోల.

స్థాణువులా కూర్చున్న హేమలత పిక్చర్ కాగానే నిర్జీవంగా లేచి నిలబడింది. మారాం చేస్తూన్న మనస్సుని మందలించేశక్తిలేక ఒక్కసారి సాహసంచేసి వెనక్కిచూస్తే .... లేడు. కన్పించలేదతను. ఎంతతొందరగా వెళ్ళిపోయాడో! ఆ పున్నమి చంద్రుడి కోసం ఏ భాగ్యశాలిని నిరీక్షిస్తూ వుందో!— హేమ చూపులు వెర్రిగా ఖాళీ థియేటరంతా పరుగులెత్తాయి.

ఇంటికి వచ్చేవరకూ మాటామంతీ లేకుండా నడిచింది శేఖరం వెంట. తల నొప్పితో బాధ పడుతోన్న భార్యని మాటలతో విసిగించదల్చు కోలేదు శేఖర్. మౌనంగానే శేఖర్ కి అన్నం వడ్డించి తనూ వడ్డించుకుంది- వేళ్ళుపెట్టి కెల కటం తప్పితే ఒక్కముద్దకూడా ఎత్తి నోట పెట్టుకోబుద్ధి కాలేదు. గ్లాసు అందుకుని నీళ్లుతాగబోతే చటుక్కున ప్రత్య

క్షమైంది.... అతని ప్రతిబింబం! చందమామనిపోలిన ఆముఖార వించం! కదలని నీళ్ళలో నిలిచి నవ్వుతోన్న ఆ చంద్ర బింబాన్ని చూస్తూ కూర్చుంది హేమ.

"ఏమిటలా చూస్తావ్? నీళ్ళలో నలక లేమైనా వున్నాయా?"

"అబ్బే! ఏంలేవు. వూరికే చూస్తున్నాను."

"పోనీ అంత అనుమానమెందుకూ? పారబోసి మళ్ళా తెచ్చుకోరాదూ?"

గ్లాసు ఎత్తిపట్టుకుని నీళ్ళన్నీ తాగేసింది. "ఏమిటో ఆకలేలేదు." అంటూ పళ్ళెం వదిలి లేచిపోయింది.

"నీకు పిక్చర్ ఎలావుంది హేమా?" పక్కమీద ఒత్తిగిలుతూ అడిగాడు శేఖర్. హేమలత కేమీ మాట్లాడాలని పించలేదు. ముక్తసరిగా అంది.

"పిక్చర్ కేం? బాగానేవుంది."

"ఏం బావుందో...నీకేం నచ్చిందో...చెప్పూ."

కొంచెం విసుగుదల కనపరిచింది హేమలత-"తర్వాత మాట్లాడుకోవచ్చు. పడుకుందురూ? తలనొప్పితో నేను సత మత మౌతోంటే..."

"ఇంకా తలనొప్పి తగ్గనేలేదూ? నిజంగా? మరైతే చెప్పవేం? కొంచెం అమృతాంజనం రాసేవాణ్ణిగా?"—లేవ బోతున్న శేఖర్‌ని వారించింది.

"—నాకిప్పుడే మందులూ అక్కర్లేదు. కాస్త ప్రశాంతంగా నిద్రపోనివ్వండి అదే తగ్గుతుంది."

"ఎందుకు హేమా నామీదంతకోపం? నేనేం చేశాననీ?" భయపడ్డ కుర్రాడిలా బిక్కమొహంవేసి హేమ గుండెలమీద తల ఆన్చుకోబోయాడు శేఖర్.

హేమ నిర్లక్ష్యంగా పక్కకి జరిగిపడుకుంది. "నాకేం కోపంరాలేదు. బాగా లేదని చెప్పానుగదా? కాస్త విశ్రాంతిగా పడుకోనివ్వండి."

"నీయిష్టం హేమా! నీ ఆరోగ్యంకన్నా ఎక్కువేమిటి?"— శేఖర్ హేమకి కొంచెం దగ్గిరిగా జరిగి నడుం చుట్టూ చెయ్యివేసి తృప్తిగా కళ్ళు మూసుకు పడుకున్నాడు. ఆటలాడి అలిసిపోయిన పాపడిలా నిద్రలోకి జారిపోయాడు.

నడుంమీదనుంచి భర్తచేయి తీసివేసి లేచికూర్చుంది హేమలత. బలవంతంగా కళ్ళు మూసుకున్నా నిద్ర రావటం లేదు. అతను...అతను...వెంటాడుతున్నాడు తనని. కాదనుకుని తోసివెయ్యటం చేతకావటంలేదు తనకి. కళ్ళు తెరచినా మూసినా ఒకే అంధకారంగా వుంది.

నీటిలోంచి తీసి ఒడ్డున వేసిన చేపలా గిలగిలా కొట్టుకుంది మనస్సు. పాల నురగలాంటి ... ఆ సౌందర్యం—మల్లె వాసనలాంటి ఆ ఆకర్షణ...ఆహా? ఏ భాగ్యశాలిని సొత్తో...? ఏ పుణ్యవతి వరమో !

నిస్పృహగా నిట్టూర్చింది హేమ! వెచ్చగా కన్నీరు జారింది చెంపలమీదుగా. నిశ్శబ్దంగా తుడుచుకుని తలగడ మీదికి వాలిపోయింది.

దుఃఖపూరితమైన రాత్రి అంతా స్వప్నలోకాలలోనే విహరించింది హేమలత అంతరంగం.

"కలకాదుకదా?" అంటూ తర్కించుకొంది హేమలత మర్నాటి వుదయం. "ఆహా! ఎంత చిత్రమైనకల! ఎంత మధురమైనకల! కాని ... కాని ... "

"రాత్రి నిద్రపోలేదా ఏమిటి? కళ్ళలా ఎర్రగా వున్నాయేం?" అన్నాడు శేఖర్ హేమకళ్ళలోకి చూస్తూ.

చటుక్కున తలదించేసుకుంది హేమ—"ఎందుకు నిద్ర పోలేదూ? బాగానే నిద్రపోయాను" అంది పైకి చూడకుండా.

"తలనొప్పి తగ్గిపోయిందా?"

"ఆఁ తగ్గింది."—మాటలు పెంచాలనీ, భర్తతో మునుపటిలా ప్రవర్తించాలనీ అనిపించలేదు హేమలతకి—నెమ్మదిగా తప్పుకుని వంటింట్లోకి దారితీసింది.

"హేమా! ఒక్కసారిలా వస్తావూ? కొంచెం తలదువ్వి వెళ్ళు."

అప్రయత్నంగా మొహం చిట్లించుకుంది హేమలత—"నాకు ఖాళీలేదు. ఎసరు మరుగుతోంది. బియ్యం ఏరుకుంటున్నాను."

"మరగనిద్దూ! ఒక్కసారివచ్చి వెళ్ళవ్? పాపిడి తీసు కుంటే వచ్చిచావటంలేదు నాకు."

నిత్యం, అలా భర్త తలకి నూనెరాసి పాపిడితీసి చెంపలు దువ్వటం హేమకి అలవాటే. తను పనిలో వున్న ప్పుడు—అడ్డదిడ్డంగా దువ్వుకుని యిన్ని వెంట్రుకలు మొహం మీదికి పడేసుకుని దగ్గరికొస్తాడు శేఖర్! తను నవ్వి - "చేత కానట్టు ఇదో వేషం—బావుందికదూ!" అంటూ కసిరి క్రాపు సరిచేస్తుంది.

తప్పదుమరి. అయిష్టంగానే లేచి వెళ్ళి దువ్వెన అందు కొంది హేమ. నిటారుగా సూదుల్లా పొడుచుకొస్తున్న ఆ వెంట్రుకల మీద చెయివేసి నిమరటానికి హఠంచేసింది మనస్సు. మెత్తని రబ్బరులా—నల్లగా నిగనిగలాడే అతని నొక్కులజుత్తు అలలుగా కళ్ళముందు కదిలింది—గబగబా చెంపలు దువ్వేసి దువ్వెన టేబుల్ మీదికి విసిరేసింది.

"ఆగవోయ్! ఏవిటా కంగారు?"

"ఎందుకూ?"

"ముందు వెనక్కిరా మరి."

"అబ్బ! చెప్పరాదూ?" పైటకొంగు వదిలించుకోటా నికి ప్రయత్నించింది.

"ఏమిటో ఆ చిరాకు...కాస్త పట్టు అందించి వెళ్లు."

"బాగానేవుంది మీ సరసం. అవతలనాకు పనుందని చెప్పటం లేదూ?"

"ఏమిటబ్బా అంత రాచకార్యం? నీపని నాకు తెలుసులే. నీ స్నానానికేగా నీళ్లు మరుగుతున్నాయి. అబద్ధాలాడితే...శిక్షేమిటో తెలుసా?"

"చాలుగాని ముందీషర్టు అందుకోండి. నేను వెళ్ళాలి."

"అదేంకుదరదు. నేను గుమ్మందాటే వరకూ నువ్విక్కడ వుండాల్సిందే!" శేఖర్ షర్టుతొడుక్కుని గుండీలు పెట్టుకుంటుంటే వుండబట్టలేక అంది — "చేతులలా పొడుగ్గా వదిలేసుకుంటే ఏం బావుంటుందీ? మడతలు పెట్టుకోరాదూ?"

"సినిమా హీరోని చేసేద్దామనుకుంటున్నావా నన్ను? అవశ్యం. రాణీగారి అభిరుచికన్నా ఈ దీనుడు వాంఛించదగినదేముంది?" చేతులు పొడుపుగా మడతలు పెట్టుకుని ఠీవిగా నిలబడ్డాడు శేఖర్ —"ఎలావుంది? బావుందా?"

ఏమీనచ్చలేదు హేమకి .... దుస్తుల ముస్తాబులో.... అసలతనికి సాటిఎవరు? అతనిలోని రాజసం....దర్జా....ఎంతటి వాళ్ళకి? "మీకంత బావున్నట్టులేదు. పోనీ అలవాటైతేసరి" అంది క్లుప్తంగా. భర్త మొహంలోకి క్షణకాలంచూస్తే తన కళ్ళనావరించిన పొరలేవో పల్చబడుతున్నట్టు అన్పించింది. శేఖర్ కళ్ళలోని ఆ పవిత్రత...పసితనం....హేమని తలదించుకునేలా చేశాయి. తను ఘోరమైన తప్పు చెయ్యటం లేదూ?

దారితప్పి ప్రయాణించటం లేదూ? తనని ప్రాణసమానంగా ప్రేమిస్తోన్న భర్తని యింతగా అసహ్యించుకునే యీ దరిద్రపు రోజెలా దాపరించింది? శేఖర్ అగ్నిసాక్షిగా తన మెడలో తాళి కట్టినవాడు! తనతో నిండు జీవితాన్నిపంచు

కున్నవాడు! మనోవాక్కాయ కర్మలా తన సాహచర్యాన్ని కోరుతూన్నవాడు! నిష్కల్మషంగా అర్ధాంగిని విశ్వసించి ఆరాధిస్తూన్నవాడు! శేఖర్ ఏమిటో తనకి క్షుణ్ణంగా తెలుసు-అతని సన్నిధిలో యెన్నడూ తను నిట్టూర్చలేదు---ఒక్క కన్నీటి బొట్టయినా చిందించలేదు. శేఖర్ వంటి భర్తయెంతో అదృష్టవంతులకుగానీ లభించదనీ---శేఖర్ని భర్తగా తను ఒక్కతే పొందగలిగిందనీ---మురిసిపోయిన సమయాలు—గర్వించిన క్షణాలూ యెన్నెన్నో...వున్నాయి—వేటినీ తను మర్చిపోలేదు.

కాని...శేఖర్ మన్మధుడుకాడు---అందగాడు కూడా కాడు. పెళ్ళిపీటలమీంద తామిద్దరినీ పక్కపక్కగా చూసిన అమ్మలక్కలు బహిరంగంగానే చెవులు కొరుక్కున్నారు-"కాకిముక్కుకి దొండపండు కట్టినట్టేవుంది—పెళ్ళికొడుకు... ప్చ్! ఏం బావున్నాడనీ? నల్లగా...సన్నగా...గెడకర్రలా... అందమా? చందమా? మన హేమకి తగినవాడు కాడమ్మా!" అంటూ సానుభూతి కురిపించారు. తనకెంతో దిగులు వేసింది. అవమానంతో తలవంగి పోయింది. తనభర్త తనకి తగినవాడు కాడని అంతా అనుకుంటూంటే తనెలా భరించగలదు?

అంతా తను అందమైందే నంటారు. "బంతిపువ్వులా మెరిసే ఒళ్ళూ—చంద్రబింబంలా చక్కని ముఖం-బారెడు తలకట్టు - తీర్చిదిద్దిన బొమ్మలావున్న మా హేమమ్మకేం లోటే శ్రీ రామచంద్రుడిలాటి మొగుడొస్తాడు" అంటూండేది బామ్మ--ఆ బామ్మే పెళ్ళిలో తను చిన్నబుచ్చుకోవటం గ్రహించి కళ్ళనీళ్ళు తెచ్చుకుంది-చెవులు కొరుక్కుంటూన్న

వాళ్ళందర్నీ కోపం తెచ్చుకు కేకలేసింది. "అందం కొరుక్కు-తింటామా ఏమిటి? గుణంవుండాలి నూరేళ్ళు బ్రతికే బ్రతుకు-మనస్సులు కలియాలిగానీ, సంసారాలు చేసుకునేవాళ్ళకి అంతకన్నా మరేవీ అక్కర్లేదు కుర్రాడు బుద్ధిమంతుడే. ఏం? కన్ను లేదా? కాలు లేదా? ఈసారి ఎవరైనా నోరెత్తి వాగండి. చెప్తాను" అంటూ అందర్నీ తిట్టిపోసి తనని బుజ్జగించింది.

అప్పట్లో బామ్మ మాటలెంతో ఓదార్పు కల్గించాయి తనకి. రాగారాగా అవి ఎంతనిజాలోకూడా అర్థమయ్యాయి. తనూ శేఖరూ సన్నిహితులు కావటానికి అందాల వంతెనే అక్కర్లేకపోయింది—శేఖర్ ఎందుకు అందగాడుకాడు? అతని కన్నుల్లో పవిత్రతవుంది. అతని మొహంలో మంచితనంవుంది అతని శరీరమంతా అమృతం నిండింది. అతని హృదయం నిండా సౌందర్యం దాక్కుంది — అతని అనురాగం తనకి సేద తీర్చింది ——— శేఖర్‌గాక యింకెవరున్నారు అందగాళ్లు ?—— "దేవుడు నాకిచ్చిన వరానివి నువ్వు, కదూ?" అంది ఎన్నో సార్లు శేఖర్‌ని హృదయానికి హత్తుకుంటూ.

హేమ భారంగా బాధగా తలపట్టుకు కూర్చుండి పోయింది. అలాంటి తన శేఖర్ అసహ్యించుకునే రోజు దాపరిస్తుందని కలలోనైనా అనుకుందా? తనలో...ఈ చాపల్యం ఎక్కడిది? ఇన్నాళ్ళూ ఎలా మరుగునదాక్కుంది? తను ఇంత అతి సామాన్యమైన ఆడదేనా?

తన చరిత్ర ఎంత వున్నతమైనది! తన పుట్టినిల్లు ఎంత పవిత్రమైనది! పట్టుమని పదిసంవత్సరాలైనా నిండని

వయసులో వైధవ్యం ప్రాప్తించింది తన మేనత్తకు. వీరేశలింగం పంతులుగారి రోజులలో పునర్వివాహం చేయాలని ప్రయత్నిస్తే సంఘ సంస్కారులందరినీ తిరస్కరించిందావిడ. ఆ నాటి నుంచీ ఆహార వ్యవహారాల్లో కఠోర నియమాలు పాటిస్తూ- పరోపకారమే పరమావధిగా భావించి- సుఖ దుఃఖాలకు అతీతురాలై జీవిస్తూన్న మేనత్తని చూస్తే చేతులు జోడించాలనిపిస్తుందిఎవరికైనా.

తన పినతల్లి మాత్రం? కార్తీక స్నానానికి చిమ్మ చీకటిలో చెరువుకెడుతుంటే ఏ పాపిష్టివాడో చెయ్యిపట్టి లాగాడని అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుని అభిమానం కాపాడుకుంది.

కాని...తనను చూసుకుంటే తనకే ఆశ్చర్యం వేస్తోంది హేమలతకు. మహా పతివ్రతలకు జన్మస్థానమైన భారతభూమి మీదపుట్టి పెరుగుతూన్న తనలో యింత చిత్రమైన వూహాలు యెందుకు రేగుతున్నాయి? తన పుట్టినింటి శీలవతుల పవిత్ర రక్తం తనలో ప్రవహించటం లేదా?

భారత నారీత్వం- పుట్టి పెరిగిన సంస్కృతీ- పురాణాలలో నీతిబోధలూ- కట్టుకున్న భర్తమీది అనురాగం- ఇవన్నీ ఒక్క సారిగా నిష్ప్రయోజనమై పోయాయా? - హాయిగా శాంతిగా భర్తనీడన సంసారం చేసుకునే భారత స్త్రీలలో యింతటి క్షణికావేశం దాగివుంటుందా? పరపురుషుడి అందానికి ముగ్ధురాలై వివేకం మరిచి దాసోహం చేసే వివశత్వం ఆవహిస్తుందా? ఏమో! ఎలా కాదనటం? తనలో ప్రస్తుతం ఏం జరగటంలేదనీ...?

"ఆడదాని మనస్సు కూడా చలిస్తుంది సుమా?" అంటే మరెప్పుడైనా అయితే హాస్యాస్పదంగా భావిం చేదే హేమలత. ఇప్పుడు.... ఇప్పుడు... తన మనస్సు చలించ లేదూ? తనలో కోరికలు రేకెత్తలేదూ?_ మనస్సూ తనువూ ఒక్కలా జ్వలించి పోవటం లేదూ?.... ఈ అసంతృప్తి అగ్ని సెగలు.... ఈ తీరని దాహపు మంటలు .... పెరిగి పెరిగి వృధృతంగా పెరిగి.... తనని సమూలంగా దహించి వేయవూ? తన వునికిని వేళ్ళంటా కదిల్చి వెయ్యవూ?

తెరలు తెరలుగా దుఃఖం ముంచుకొచ్చింది హేమ లతకు. తెగినగాలిపటంలా యథేచ్ఛగా కొట్టుకున్న మనస్సు యథాస్థానంలోకి వచ్చి వాలింది. రేగిన తేనె పట్టులా అలుముకున్న ఆలోచనలు తేలి తేలి గాలిలో కలిసిపోయాయి_ తనను తను విమర్శించుకోవాలో, సమర్థించుకోవాలో తెలీని స్థితిలో అల్లాడి పోయింది_ తన వ్యూహాలేమిటో అతీతంగా వున్నాయి. తన గమ్యమేమిటో అయోమయమైపోయింది. తనని తను నిర్బంధించుకోవాలా? స్వేచ్ఛగా కట్లు తెంచు కోవాలా? ఏం చెయ్యాలి ? .... అసలు తనేమిటి? ఏమౌతోంది?.... అర్థంకాకుండా పోయింది.

* * *

వెన్నెల చల్లగా లోకాన్ని పాలిస్తోంది. ఎంతో సేపటినుంచి అలా వెన్నెల చల్లదనంలో కూర్చున్నా శరీరం శాంతించటంలేదు హేమకి. మంద మందంగా పిల్లగాలులు ఒళ్ళంతా నిమిరి బుజ్జగిస్తోన్నా వూరట కల్గటం లేదు. నోరు

విప్పి మాట్లాడాలంటే మనస్కరించటంలేదు- వూహా లోకాల్లో విహరించాలంటే ధైర్యం చాలటం లేదు- నరకం అంటే వేరే యింకెక్కడుంటుంది?- తన సంతోషమే స్వర్గం-తన దుఃఖమే నరకం.

"హేమా"

వినిపించనేలేదా పిలుపు.

చటుక్కున కళ్ళమీద చేతులు మూతలు పడటంతో త్రుళ్ళి పడింది హేమ. అంతలోనే కోపం తెచ్చుకుని, "అబ్బ! చేతులు తీయండి. ఏవిటా అర్థంలేని సరసం? నేనేదో పర ధ్యానంగా కూర్చుంటే హఠాత్తుగా వచ్చి కళ్ళు ముయ్యటం ఏమిటి?" విసుగ్గా శేఖర్ చేతులు తోసివేసి లేచింది. శేఖర్ మోటుగానే ఆమెని బంధించి బలవంతంగా బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు. "ఎన్నాళ్ళిలా పరాకులు చిత్తగిస్తావ్?"

కోపంతో మాట్లాడదల్చుకోలేదు హేమ.

"ఇవ్వాళ నీకో చిత్రమైన సంగతి చెప్తాను."

వినాలన్న కుతూహలమేం కలగలేదు హేమకి.

"పూర్తిగా వినకుండా నువ్వు కోపం తెచ్చుకోకు సుమీ!"

చిరాగ్గా అంది హేమ.- "కోపం...అస్తమానూ ఎందు కొస్తుంది నాకు?"

"ఇదిగో ఇప్పుడు వచ్చిందిగా మరి, — అయితే చెప్పేదా? ఎప్పుడెప్పుడు యింటికివచ్చి నీతో చెప్పేస్తానా అని..."

"ఏవిటో అంత గొప్ప సంగతి—!"

"ఇవ్వాళో చిత్రమైన అనుభవం అయింది నాకు"

హేమ విసుగ్గా రెండడుగులు వేసి పిట్టగోడకి ఆనుకుని నించుంది.

"చిత్రం- విచిత్రం- అనుకుంటూ కూర్చోకపోతే చెప్పరాదూ?"

"విను మరి- నేను మామూలుగా వచ్చేస్తోంటే ఓ అమ్మాయి ఆపేసింది నన్ను-" హేమ వెనగ్గా వెళ్ళి నుంచున్నాడు శేఖర్.

చిత్రంగా చూసింది హేమ.

"ఆశ్చర్యంగా వుంది కదూ? నేనూ అలాగే కొంచెం ఆశ్చర్య పోయాననుకో."

"అమ్మాయి మిమ్మల్ని ఆపటం ఏమిటి? అసలెవరావిడ? ఎక్కడాపింది?" ఏమంత కుతూహలం లేకపోయినా సామాన్యంగా అడిగింది హేమ.

హేమ మొహంలోకి చూస్తూ అన్నాడు శేఖర్— "'రోజూలాగే నేను సైకిల్ మీద వచ్చేస్తున్నాను హేమూ! రైలుగేటుదాటిన తర్వాత చిన్నవంతెన వుంటుంది చూశావా?

అదికూడా దాటాను. రోడ్డు వారగా ఓ అమ్మాయి నిలబడి వుంది_ ఎవరోలే అనుకొంటూ నా దారిన నేను రాబోయాను. చటుక్కున ఆమె సైకిల్‌కి అడ్డు వచ్చేసింది. చెయ్యి జాపింది. సడన్ బ్రేకు వేసి ఆగాను. ఓ అడుగు ముందుకు తుళ్ళిపడి నిలదొక్కుకున్నాను. ఒక్కసారి ఏదో సెంటువాసన గుబాళించింది. నాకేదో అర్థం లేని అనుమానం కలిగింది. మామూలుగా ఆవిడకేసి చూశాను. ఏమీ మాట్లాడటం లేదు. కాస్సేపు నేలమీదికి -కాస్సేపు నా మీదికీ కళ్ళు తిప్పి తిప్పి చూస్తూ నించుంది. నాకేం చెయ్యాలో అర్థంకాలేదు. అయోమయంలో పడ్డట్టే అనిపించింది.

"మీరు...మీరు...నన్ను పిల్చారాండి?" అన్నాననుకుంటా. ఎలా పల్కరించానో సరిగ్గా గుర్తులేదుగానీ తడబడ్డానని మాత్రం చెప్పగలను.

జవాబేమీ చెప్పకుండా తలఎత్తి సూటిగా చూస్తూ అదోరకంగా నవ్వింది.

"ఆ అమ్మాయి వేశ్య ఏవిటి?" అంది హేమ వుండబట్టలేక.

"ఆఁ ఆఁ అటువంటి వృత్తిచేసుకునేదే" అన్నాడు శేఖర్.

హేమకి కుతూహలం పుట్టుకొచ్చింది. "ఆ అయితే అప్పుడేమైంది? మీరు మళ్ళా ఏవన్నారు?"

"ఏమన్నానా? వినుమరి—ఆవిడేం జవాబు చెప్పకుండా నవ్వుతోంటే నాకు కాస్త చిరాకువేసింది. ఆవిడ

వేశ్యలాంటిదేమోనన్న అనుమానవైతే కలుగుతోందిగానీ ఏమో—ఎలా నమ్మటం? నేనే పొరపడుతున్నానేమో! అంత తొందరగా అపార్థం చేసుకోవటం తప్పుకదూ? అనుకుని కొంచెం బింకంగానే అడిగాను — చెప్పండి. నాతో ఏమైనా పనివుండి పిలిచారా?" అలా రెట్టించటంతో ఆ అమ్మాయి మరోసారి నా మొహమంతా చూసి చటుక్కున తల దించేసుకుంది — "నిజంగా మీకు తెలీకే అడుగుతున్నారా?"

నాకు మతే పోయిందనుకో. తన వుద్దేశ్యమేమిటో తేల్చి చెప్పదు. నన్నే అర్థంచేసుకోమన్నట్టు చూస్తుంది. ఆవిడ చెడిపోయిందేమోనని నిర్ణయించుకుందామా అంటే మనస్సుఒప్పటంలేదు. ఒకసారి చుట్టుపక్కల చూశాను. పుచ్చపువ్వులాంటి వెన్నెల్లో అలా మేమిద్దరం రోడ్డు వారకి నిలబడి మాట్లాడుకోవటం నాకే ఏమిటో వెగటనిపించింది— ఉన్నట్లుండి సైకిల్ మీద చెయ్యివేస్తూ అంది.

"అదిగో అటుపక్కగా యిల్లు వుంది. రండి వెళ్దాం."

ఆ చొరవకి నేను నిర్ఘాంతపోయాను. అంతా అర్థమైపోయింది. తల అడ్డంగా తిప్పుతూ—"క్షమించండి. నేను యింటికి వెళ్ళాలి" అనేశాను అప్రయత్నంగా. సైకిల్ నడిపించుకు రాబోయాను. గట్టిగా పట్టుకుంది హేండిల్ బార్ ని—

"నన్ను అపార్థం చేసుకోకండి. నేను అందరిలాంటి దాన్ని కాదు. మీరేం భయపడకండి." అంది దీనంగా

చూస్తూ-నాకేమనాలో అర్థంకాలేదు. పిచ్చివాడిలా చూస్తూ నించున్నాను.

"నన్ను నమ్మండి. మీ ఆరోగ్యమేమీ పాడుకాదు. నేను బొత్తిగా అంతచెడ్డదాన్ని కాదు." ఆమె కంఠస్వరం వణకటం నాకు స్పష్టంగా తెలిసింది. నేను ధైరంచేసి అన్నాను. "మీగురించి నేను చెడ్డగా భావించటం లేదులెండి....కాని.... కాని....ఇలాంటి అలవాటు నాకెప్పుడూ లేదు."

నమ్మలేనట్టు చూసింది—అంతలోనే ముఖకవళికలు మరోరకంగా మార్చుకుంది. "అవును. మిమ్మల్ని చూస్తూ నేనలా అనుకున్నాను. అయినా నా అవసరంకోసం పిలిచాను."

"అవసరమా? ఏవిటది?"

నిరాశతో వూగిసలాడుతున్నట్టు నవ్వింది. "మాబాధలు మీకెందుకులెండి. దయవుంచి ఒక్కసారి మా యింటికి వచ్చి వెళ్తే....సంతోషిస్తాను." ఆమె మాటల్లో మోసం, నటన... లాంటివేమీ వున్నట్టనిపించలేదు. నిజంగా ఎంతో అభిమానవతిలాగే గోచరించింది. ఒకవేపున జాలికలిగినా మొండికేసి అన్నాను. "నేను ముందేచెప్పాను. ఇలాంటి అలవాటు నాకు లేనూలేదు. ఇష్టమూలేదు. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఇంటికు వెళ్ళాలి."

"మీ భార్యగారు ఎదురు చూస్తూ వుంటారా?" నవ్వింది.

"తప్పకుండాను, నేను యింటిగడప ఎక్కేవరకూ బిక్కు బిక్కుమంటూ కూర్చుని వుంటుంది."

"అదృష్టవంతులు" గొణుక్కుంది— అంతలోనే తలెత్తి అడిగింది. "ఆవిడ చాలా అందంగా వుంటారా?"

"చూడండమ్మా! అలాంటి విషయాలన్నీ ముచ్చటించుకునే సమయంకాదు ఇది...మీ యింటికి మాత్రం నేను రాలేనని చెప్పటానికి విచారిస్తున్నాను. ఇందాక అవసరమో ... ఏదో ... అన్నారే ... అదేమిటో చెప్తే ... నాకు వీలైతే సహాయంచేస్తాను."

అంతలోనే వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించింది. నేను గాభరాపడిపోయాను. అనవసరంగా నన్నేం అల్లరిచెయ్యదు గదా అని భయపడ్డాను.

"మీ రలా ఏడవకండి—చూడండీ! ఏమైందనీ? నేనేం అనలేదే!"

"క్షమించండి. మీరు నన్నేం అనలేదు. మిమ్మల్ని చూసి మీ మాటలు వింటోంటే నా దుఃఖం కట్టలు తెంచుకుంటోంది. అంతా మీవంటి వుత్తములేవుంటే నావంటి దౌర్భాగ్యులు తయారవ్వేవారే కారు...సుఖంగా భర్తతో కాపురంచేసుకుంటున్న నన్ను మచ్చిక చేసుకుని మాయ మాటలు చెప్పి నమ్మించి తీసుకువచ్చి...ఈనాటికిలా మోసం చేసిపోయాడో పుణ్యాత్ముడు." మళ్ళా ఆపుకోలేకుండా వెక్కి వెక్కి ఏడ్చింది. కొంచెం తేరుకుని—"మానమర్యాద లమ్ముకుని ఏడాది పసివాణ్ణి బ్రతికించుకు వస్తున్నాను—నాకు జరిగిన

మోసాన్ని క్షమించ లేకపోయినా నా బిడ్డని దూరంచేసుకో లేను___అన్నిటికీ చెడిపోయిన నాకు నా పసివాడైనా దక్కుతాడో లేదో -- పుట్టెడు జ్వరంలో పడివున్నాడు. మంచి మందులు వాడే అదృష్టంలేదు. నా పాప...నా పాప..." మనస్సులో యిముడ్చుకోలేని బాధనంతా ఏడుస్తూ ఏడుస్తూ నాతో వెళ్ళబోసుకుంది. పాపం నాకు ఎంతో జాలివేసింది. "ఆమెని సంతోషపెట్టటానికి ఏమైనా చెయ్యగలిగితే బావుండును" అన్పించింది. ఆమె మొహంకేసి చూస్తూ అడిగాను_ "చూడండి మీరేం చదువుకోలేదా?"

ఆమె నిట్టూర్చింది — "అవును. మీలా తెలిసిన వారంతా నాదే తప్పంటారు. భర్తకి ద్రోహంచేసి పరాయి వాడితో లేచివచ్చిన నాకు వివేకంఏది? ఎంత చదువుకుంటే మాత్రం ఎందుకు? కాల్చనా? దురదృష్టదేవత నెత్తెక్కి అలా ఆడించింది....అంతా నా ఖర్మ....ఖర్మ...." అంటూ వాపోయింది.

"జరిగిపోయిందానికి బాధపడి ఏం ప్రయోజనం? పోనీ యింటికివెళ్ళి క్షమాపణ కోరుకుంటే..." నామాటలు నాకే అసందర్భంగా వినిపించాయి. ఆమె విచిత్రంగా చూసింది_ "నన్ను ఎగతాళి చేస్తున్నారా బాబూ? ఎవరితోనో లేచిపోయి పిల్లనికని మళ్ళా యింటికి వస్తే ఆదరించటానికి ఆయనేం మానవాతీతుడా? పరువు మర్యాదలులేని అనామకుడా?... ఆ పుణ్యాత్ముడికి మళ్ళీ మొహం చూపించగలనా? నా వల్లకాదు... నా వల్లకాదు_ ఈ రకంగా కూడా

బ్రతుకు గడవకపోతే నా గోదావరి తల్లి వుంది, నేను వున్నాను."

"తప్పు, అలాంటి పనెప్పుడూ చెయ్యకండి. మీ అబ్బాయి పెద్దవాడైతే మిమ్మల్ని చూస్తాడు. ఆ ఆశ పెట్టుకు బ్రతకాలి—"

నిరాశగా నవ్వింది– "వాడు బ్రతికినప్పటిమాటకదా నన్ను బ్రతికించటానికి?"

గుర్తువచ్చి చటుక్కున పర్స్ తీశాను. ఒక పదిరూపాయలనోటూ కొంత చిల్లరా– "చూడండమ్మా! ప్రస్తుతానికి యిదే నాదగ్గిరవుంది. అబ్బాయికి వైద్యం చేయించండి." అంటూ యివ్వబోయాను.

ఆశ్చర్యంగా చూసింది– "మీరు మా యింటికి రానన్నారుగా?"

"రాకపోతేనేం? పసిబిడ్డకోసం నేనిది యిస్తున్నాను. తీసుకోండి. అనుమానం ఎందుకు?"

"వద్దులెండి. అందరూ మీవంటి మగవాళ్ళే అయితే నేను బ్రతకలేనని భయపడాలిగానీ ... ప్రస్తుతానికి ఆ బెంగేమీ లేదు. మరో గంటసేపు యిక్కడే నించున్నానంటే రెండో మూడో సంపాదించుకోలేకపోను. ఈ పది రూపాయలూ నాకిచ్చి అపాత్రదానం చేయకండి. మీకు తృప్తీవుండదు, నాకు సంతోషమూవుండదు."

"మీ పరిస్థితులు మీవి. మిమ్మల్ని నేను విమర్శిస్తాననుకోవద్దు. ప్రతీ మనిషి వున్నంతలో, వున్నతంగా బ్రతకాలనే

ఆశిస్తాడు. మీ రింత దిగజారిపోయారనుకుంటే ఇంతకన్నా మరోదారి లేక నే కావచ్చును. మీ కేదో నీతి బోధచేయా లనీ మిమ్మల్ని మార్చాలనీ నా వుద్దేశ్యంకాదు. పసివాడు జ్వరంతో వున్నాడన్నారు. వెంటనేయింటికి వెళ్ళి ఏ డాక్టర్ దగ్గరికైనా తీసికెళ్ళి మందు వేయించండి. అందుకే ఈ డబ్బు సంతోషంగా యిస్తున్నాను–" అంటూ నోటు ముందుకు చాపాను.

ఆమె ఆవేశంగా చేతులు జోడించింది– "మీరు సాక్షాత్తు దైవస్వరూపులు. మీ భార్య కలకాలం పసుపు కుంకుమలతో వర్ధిల్లాలి. చెడిపోయిన ఆడదానితో ఇంత గౌరవంగా– ఇంత అభిమానంగా మాట్లాడే మగవాడిని నే నెన్నడూ చూడలేదు. అన్నగారూ! ఈ డబ్బు తీసు కుంటాను. మీ చేతి చలవవల్ల నా బిడ్డ నాకు దక్కుతాడు కూడాను. ఈ దౌర్భాగ్యురాల్ని మర్చిపోకండి– మిమల్ని జీవాలున్నంతకాలం గుర్తు వుంచుకుంటాను... మరి వెళ్ళి రండి." ఆమె కంఠం రుద్ధమైంది. నాకు కూడా దుఃఖం ముంచుకు వచ్చినట్టయింది. ఏమీ మాట్లాడలేక పోయాను– "వెళ్తానమ్మా!" అనేసి రెండడుగులు ముందుకు వేసి ఆగి వెనక్కి చూశాను. ఆమె కదల్లేదు. నాకేసే చూస్తూ నించుంది.

"మీ పేరేవిటమ్మా? అభ్యంతరం లేకపోతే..."

"నా చరిత్ర తెలిసి నా పేరువింటే... అసహ్యించు కుంటారు... చెప్పమంటారా? రుక్మిణి... చూశారా? ఎంత పవిత్రమైన..."

"పేరులో ఏముంది? వస్తానమ్మా!" అనేసి సైకిల్ నడిపించుకుని రోడ్డుమీదికివచ్చి ఈ జరిగిందంతా నీకు చెప్పాలని ఆఘమేఘాలమీద వచ్చేశాను," శేఖర్ హేమ భుజాలు పట్టి కుదుపుతూ అన్నాడు. "విన్నావా? ఎలావుంది?"

ఆలోచనల్లోంచి తేరుకుంటూఅంది హేమ– "విన్నాను విన్నాను." నాలుగడుగులు నడిచి కొబ్బరి ఆకులు వాలేచోట పిట్టగోడకి ఆనుకుని కూర్చుంది– శేఖర్ ఆమె గడ్డం పట్టుకుని కళ్ళలోకి చూస్తూ అడిగాడు—

"నీ కేమైనా కోపం వచ్చిందా నామీద?"

"ఎందుకు "

"అలా అంతసేపు ఆవిడతో మాట్లాడానని."

"కోపం రాలేదుగానీ – మిమ్మల్ని కొన్ని విషయా లడగాలనుకుంటున్నాను. మనస్ఫూర్తిగా చెప్తారా?"

"హేమా! నా మీద నీకెందు కలాంటి అనుమానం వచ్చింది?"

"అయితే చెప్పండి, మీరెందుకని ఆమెతో వెళ్ళ లేదు?"

"ఇదేం ప్రశ్న? నేను ఆమెతో వెళ్ళటం తప్పుకాదా? నీకు తెలీకే అడుగుతున్నావా."

"ఏం తప్పు? ఎందుకు తప్పు? మీ వుద్దేశ్యం చెప్పండి. తప్పేవిటో ఒప్పేవిటో నాకేం తెలీటంలేదు. మగవాళ్లు ఏం చేసినా తప్పుకాదటగా."

నిజమే సంఘం అలాగే అంటుంది. కాని అందులో నాకు ధర్మం కన్పించటంలేదు."

"ఎందుకని?"

"మనస్సు అనేది స్త్రీ పురుషులిద్దరికీ ఒక్కటే. శారీరక సుఖాలు యిద్దరికీ కావాలి. కాదంటే అది మన మూర్ఖత్వమే అవుతుంది. అవునంటావా?"

"ఊఁ."

"అందుకే యుక్తవయస్సు వచ్చేసరికి వివాహం పేరిట ఒక స్త్రీనీ, మరొక పురుషుణ్ణీ న్యాయ సమ్మతంగా కలపటం జరుగుతుంది. వారిద్దరే ప్రకృతీ పురుషులుగా జీవిస్తూ సృష్టి ధర్మాన్ని పెంచాల్సి వుంటుంది. చూడు హేమా! అందరూ యిలా కొన్ని కట్టుబాట్లకు లోనై బ్రతికితేనే సంఘం మొత్తంగా శాంతి సౌఖ్యాలతో నిండి వుంటుంది."

"కాని...ఆ స్త్రీ పురుషుడికి గానీ..... పురుషుడు స్త్రీకి గానీ ఇష్టం కానప్పుడో?"

"అది వ్యక్తిగతం— అలాంటి పరిస్థితి రాకుండా వివాహానికి ముందే జాగ్రత్త పడాలి."

"పోనీ వివాహం జరిగాకే అలాంటి అయిష్టాలేమైనా సంభవిస్తే...?"

"న్యాయమైన కారణం వుండాలి. అప్పుడే వాళ్ళని సమర్థించటానికిగానీ, క్షమించటానికి గానీ అర్హత వుంటుంది- ప్రస్తుతానికి నా విషయమే తీసుకో. నేను రుక్మిణితో వెళ్ళటం

తప్పు కాదంటావా, నీ వల్ల నేనేమైనా అసంతృప్తి పొందు తున్నానా? సుఖపడలేకపోతున్నానా? ఎందుకని నా నీతిని నేను పోగొట్టుకోవాలి?"

"నీతి మగవాడికి కూడా ముఖ్యమంటారా?"

"ముమ్మాటికీ. మగవాడు నీతిగా వుంటే ఆడది చెడి పోయే మార్గంలేదు."

"అయితే ఒక్కటి చెప్పండి. నీతి శాస్త్రాలు వల్లెవేసు కుని దానికోసమే కోరిక చంపుకుని కట్టుబడ్డారా? లేక..."

"హేమా! ఇంతకాలానికి కూడా నన్ను అర్థంచేసుకో లేక పోయినందుకు విచారిస్తున్నాను. నిన్ను తప్పితే యింత సన్నిహితంగా మరెవ్వరినీ రానివ్వలేను. నా మనస్సునిండా నిన్నే ప్రతిష్ఠించుకున్నాను. భగవంతుడు ప్రవేశించటానికి కూడా చోటులేదు." ఆవేశంగా హేమని గుండెలకి అదుము కున్నాడు శేఖర్. హేమ లేవటానికి ప్రయత్నించకుండా వాలి పోయి పడుకుంది. "ఆ రుక్మిణి అందమైందేనా?"

"అంటే?"

"అంటే తెలీదా? నాకన్నా అందంగా వుందా?"

"చాలా అందంగా వుంది. మిసమిసా మెరిసినట్టు కనిపించింది."

"వెన్నెల్లో అలా కనిపించిందేమో..."

"కాదు. ఈ వెన్నెల్లో వున్న నీ శరీరం అంత తెల్లగా లేదు."

"పోనీ జుట్టు నొక్కు నొక్కులుగా అందంగావుందా?"

"చెప్తానుండు. అందమంటే యిప్పుడర్థమైందినాకు—నీ అంచనాలప్రకారం రుక్మిణి సౌందర్యరాశి అంటే అతిశయోక్తి కాదు. విశాలమైన కళ్ళు మూగభావాలు ప్రదర్శిస్తోంటే చూడడానికి విచిత్రంగా వుంటుంది. శంఖంవంటి ఆమె నున్ననిమెడలో ఒకేఒకనల్లపూసలదండ. నుదుటిమీదికి పరిగెత్తి గంతులేసే అల్లరిజుత్తుని అదిలించాలని అస్తమానం ప్రయత్నిస్తూనే వుంటుంది. ఆమె అలంకరణలోకూడా ఏదో గాంభీర్యం వుట్టిపడుతుంది. ఆమె చదువుకున్నదికూడాను. సున్నితంగా, వివేకంగా మాట్లాడుతుంది—ఆమెలోవున్న సంస్కారం అన్నివిధాలా ఎదటివ్యక్తిని ఆకర్షించగలదు."

హేమ చంద్రుడిలోకి చూస్తూ అడిగింది హేళనగా—"అంత అందాలరాశి మీ కెందుకని నచ్చలేదు?"

"హేమా! ఎదటివ్యక్తిని అర్థంచేసుకో లేకపోతే అది నీ బలహీనత. ఆమె ఎటువంటిదని, నువ్వడిగితే నిర్మొహమాటంగా చెప్పాను అంతే. నాకు కావల్సింది మాత్రం ఆమె అందచందాలు కావు-రంభ ఎలావుంటుందో చూడకపోయినా రంభను తలపింపజేసేవాళ్ళు నిత్యజీవితంలో తరుచూ తారసపడుతూనేవుంటారు."

"ఒక్కమాట—అడ్డువచ్చాననుకోకండి. అటువంటి సమయాలలో మనస్సు ఎన్నడూ చలించలేదా?"

గర్వంగానన్నాడు శేఖర్—"ఎన్నడూలేదు. ముందు అలా జరగదని కూడా చెప్పగలను. నామీద నాకు అంత

మాత్రం విశ్వాసంవుంది. నన్ను నమ్ము హేమా? నా మనస్సులో హత్తుకున్న చిత్రం అంత తేలికగా చెదిరిపోదు. నన్ను నమ్మినవ్యక్తికి నేనెన్నడూ మోసం చెయ్యలేను. ఒకరకంగా యిది నా బలహీనత కూడాను."

పవిత్రతతో. ప్రకాశిస్తోన్న శేఖర్ కళ్ళలోకి చూడలేక తల దించుకొంది హేమ.

"హేమా! నిజంచెప్పు. ఎంత నవమన్మథమూర్తిని చూస్తేమాత్రం నీ మనస్సు చలిస్తుందా? స్త్రీ హృదయానికున్న పవిత్రత పురుషుడికి లేనే లేదనుకున్నావా?"

భయంతో బిగుసుకుపోయింది హేమ. తన మనస్సు తెలుసుకుని అపహాస్యం చేయడంలేదుకదా? అన్నట్టు జంకుగా చూసింది.

"ఎందుకలా చూస్తావ్? తప్పుగా మాట్లాడాననా?"

"........."

"మాట్లాడు హేమా! కోపంవచ్చిందా?"

"లేదండీ! నాకేం కోపంరాలేదు." బావురుమని ఏడవాలనిపించింది. తను ఎంత నీచమైందో తెలిస్తే శేఖర్ ఏమౌతాడో! అతని అనురాగానికి ప్రతిఫలం నిజంగా తను యివ్వలేకపోతోందేమో! లేకపోతే మగజన్మఎత్తిన అతడే అంత పవిత్రంగా వుంటుంటే తను...తను...ఇంత చలించిపోవటం ఏమిటి?—

"ఎందుకంత మౌనంగాకూర్చున్నావు?"

"అబ్బే! ఏంలేదు. రుక్మిణిగురించి ఆలోచిస్తున్నాను."

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఆమె తప్పే చేసిందికదూ?"

"అంతే అనక తప్పదుమరి. వివాహం-భార్యాభర్తల బంధం కేవలం శారీరక సౌఖ్యాలకోసమేకాదు. సామాజికంగా, నైతికంగా కొన్ని బరువులూ బాధ్యతలూ వహించాల్సి వుంటుంది---అవసరమైనచోట త్యాగ ధర్మంకూడా నిర్వర్తించాలి--నేను నా యిష్టంవచ్చినట్టూ నువ్వు నీ యిష్టం వచ్చినట్టూ సంచరిస్తే ఇక మనకీబంధం ఎక్కడిది? ఈ మమకారం ఎక్కడిది? నువ్వు నాకోసం నిరీక్షిస్తూవుంటావని తెలిసినప్పుడే నేను నిన్ను చేరుకోవాలని తహతహలాడగలను--న్యాయసమ్మతంగా మనకు సంతానం కలిగితే సంతోషంగా స్వీకరించగలం—మన సంఘ నియమాలు ఎంత కఠినమైనవో అంత మృదువైనవి కూడాను."

"స్త్రీపట్ల అన్ని విధాలాన్యాయం జరుగుతోందంటారా,"

"లేకపోవచ్చు. క్రమంగా అదికూడా పొందగలం. ఈ నీతినియమాలు--ఈ కట్టుబాట్లూ లేకపోతే "నా" అనేదేమీ మిగలదు. నువ్వు నా ఒక్కడికే భార్యవుకావు. ఇది మన ఇద్దరికే యిల్లుకాదు — నీ మీద అందరికీ హక్కువుంటుంది. అలాగే నేను నీవంటివాళ్లు చాలామందితో సంబంధాలు పెట్టుకోగలను. అప్పుడు ఎవరిస్వార్థం వాళ్ళది. ఒకరి

కష్టసుఖాలు ఒకరివికావు. ఒకరి మంచిచెడ్డలు మరొకరివి కావు."

"పోనీ ఆర్థికంగా అందరూ సమానత్వాన్ని పొంది ఎవరి స్వార్థం వాళ్ళేచూసుకోవచ్చుగా? ఒకరిమీద ఒకరు ఆధారపడటం దేనికి? అవకాశాలు యిస్తే స్వతంత్రించి బ్రతికలేదూ?"

"స్త్రీ పురుష భేదం ఎందుకు? మొత్తంగా ఆలోచిస్తే ధనాన్నీ దర్జానీ—అధికారాన్నీ- హోదానీ- ఆఖరికి శారీరక సుఖాన్ని కూడా మరపించే శాంతిదాయకమైన అనురాగాన్ని కోరుతుంది అంతరంగం. శరీరంలో జవసత్వాలు వున్నంతవరకే ఈ విచ్చలవిడితనం పనికివస్తుంది. అటు తర్వాత అతిప్రశాంతమైన స్థానం కావాలి విశ్రమించటానికి. అప్పుడది ఎలా సాధ్యం?- రుక్మిణి విషయం చూడు. భర్తదగ్గరేవుంటే ఆవిడ కష్టసుఖాలూ, ఆ బిడ్డ బాధ్యతలూ అతనే వహించేవాడు. కాని ఆవిడ వుమ్మడిసొత్తు. సుఖించటానికే గానీ భరించటానికెవ్వరూ ముందుకురాలేరు- ఒకే తప్పు స్త్రీ పురుషులిద్దరూ చేసినా దాని ఫలితం- ఒక్క స్త్రీయే అనుభవిస్తోంది ప్రత్యక్షంగా- స్త్రీమీద ప్రకృతే పవిత్రమైన బాధ్యత పెట్టింది. దాన్ని అంత పవిత్రంగా నిర్వర్తించాల్సిన అవసరం స్త్రీకి వుంది. తన బిడ్డకు తండ్రి ఎవరో తెలుసుకోలేని స్త్రీ మనోవేదనకన్నా క్షణికమైన శరీర సుఖంలో వున్నతివుందా? అందుకే అన్నికట్టుబాట్లూ—అన్ని నియమాలూనూ. చెడిపోవటంలోకూడా సమానత్వం కావాలా స్త్రీకి ?"

వింతగా చూసింది హేమలత ఏదో ధైర్యం తెచ్చుకుని చిత్రంగా అడిగింది – "నామనస్సు ఎన్నడూ చలించివుండదని మీరనుకుంటున్నారా?"

"మానవుడికి చాంచల్యం అతిసహజం– నీలోనూ ఆ ధర్మం వుంటే వుండవచ్చును. కాని మనం వివేకం గల వ్యక్తులం. ఆలోచించగలగటం మన జన్మ హక్కు— పశువులకీ మనకీ తేడా వుంది. ఉండాలి. మనస్సు చలించినంత మాత్రాన మన వివేకం ఏమౌతుంది? నీ సుఖదుఃఖాలు అంచనా వేసుకో లేని హీనస్థితిలో నువ్వున్నావని నేను అనుకోను."

హేమ స్థాణువులా కూర్చుండిపోయింది. తనకు ఏది సుఖం? ఏది దుఃఖం? శాశ్వతమైన శాంతిమార్గమా? క్షణిక మైన శరీర సౌఖ్యమా? ఏది...? ఏది? ... చటుక్కున మోకాళ్ళలోతలదాచుకుంది.

"హేమా! ఏమిటి? ఏమైంది?" ఆతృత పడ్డాడు శేఖర్.

హేమ వెక్కి వెక్కి ఏడుస్తూ అతని హృదయం మీద వాలిపోయింది.

"ఏమైందిహేమా ఏడవకు, ఏడవకు. ఈ ఒక్కరోజు నాతో సరదాగా మాట్లాడుతూ కూర్చున్నావు. వారం రోజులనుంచీ—"

"నన్ను క్షమించరూ నన్ను నన్ను..." మాటలు పెగలలేదు. శేఖర్ గుండెలమీద చేత్తో రాస్తూ అతని బుజం మీద తల ఆన్చుకుంది హేమ.

"ఏమిటో నాకు చెప్పు హేమా! నేను వుండగా నువ్వు ఒక్కదానివే బాధపడవచ్చునా? నీ కష్టం నన్నూ పంచుకో

నీయవూ? " హేమకళ్ళు ఒత్తి చెంపలుతుడిచి బుజ్జగించాడు శేఖర్.

దుఃఖావేగం తగ్గి కొంత ఉపశమించింది హేమ—"వారంరోజుల క్రిందట నాకో పాడుకల...పీడకల వచ్చింది."

"పీడకలా? ఏమనీ?"

"పెద్ద విషపునాగు నా గుండెలమీద బలంగా కాటు వేసింది– అంతే. ఆ దారుణవిషం నాలో నరనరానా పరిగెత్తి నా శరీరమంతా వికృతమైపోయింది. నా రూపమే మారి పోయింది. నేను సజీవంగా యమయాతన అనుభవించాను."

"హేమా ! ఇంత చిన్న విషయానికి బాధపడాలా నువ్వు? జీవితంలో ఒక్క పీడకలేవిటి? ఎన్నో విషాద సంఘటనలు ఎదుర్కోవలసి వుంటుంది. ఎంతదారుణమైన పరిస్థితులు సంభవించినా సడలిపోకూడనిది మనోధైర్యం-ఆత్మవిశ్వాసం-అప్పుడు ఏ పీడకల ఏమీ చెయ్యలేదు"

ఆ మాటలు హేమ హృదయానికి చాలా వూరట కల్గించాయి. నిజంగా పీడకలే వచ్చింది. కాకపోతే ఏమిటి! తను మారిపోవటం ఏమిటి? తన మనస్సు... చలించటం ఏమిటి? అందానికి అవధివుందా? సుఖానికి సరిహద్దువుందా? తనకి వున్నదే పరమావధి! తను పొందగలిగేదే పెన్నిధి.

శేఖర్!నిజంగా... తన పాలిట పెన్నిధికాదా? తనకు ...దేవుడిచ్చిన వరంకాదా? తన శేఖర్ కన్నా... సౌందర్య మూర్తి మరెవరు? హాయిగా తేలిపోతోన్న మనస్సుతో తల ఎత్తి ఆకాశంలోకి చూసింది అరమోడ్పు కన్నులతో....

చిలిపి జాబిల్లి ఫక్కుమని నవ్వింది.

(మే '64 'జ్యోతి' నుంచి)